క్లుప్తంగా

సాగర్ జలాలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న బొంతు సమత

వైరా: వైరా రిజర్వాయర్‌కు సాగర్ జలాలు విడుదల చేసి తాగునీటి ఇబ్బందులు తొలగించాలని వైరా మాజీ ఎంపీపీ బొంతు సమత ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం వైరా సీపీఎం కార్యాలయంలో రుద్రాక్షల నరసింహాచారి అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం శాఖా సమావేశంలో ఆమె మాట్లాడారు. వైరా జలాశయం నుంచి సమారు 11 మండలాలకు తాగు నీరం దిస్తున్నారని రిజర్వాయర్‌లో నీళ్ల లేక ప్రస్తుతం తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మందడపు రామారావు, కురుగుంట్ల నాగేశ్వరరావు, ఎస్‌కే జమాల్, వడ్లమూడి మధు పాల్గొన్నారు.

రఘురాంరెడ్డికే ముస్లిం మైనార్టీల మద్దతు



మాట్లాడుతున్న జానీబాషా

ఎర్రుపాలెం: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డికి ముస్లిం మైనార్టీల మద్దతు ఉంటుందని కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనార్టీ సెల్ మండల కమిటీ అధ్యక్షుడు షేక్ జానీబాషా తెలిపారు. ఆదివారం మండలంలోని మీనవోలు గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌తోనే లౌకికరాజ్యం వస్తుందన్నారు. దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే ముస్లిం మైనార్టీలకు రక్షణ ఉంటుందన్నారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలన్నదే ముస్లీం మైనార్టీల లక్ష్యమన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఎస్‌కె ఫరూక్, ఎస్‌కే కుర్షీద్, సైదులు, మౌలాలి, మస్తాన్, రఫీ, ఎస్‌కె రాజా, హుస్సేన్, ఇస్మాయిల్, అలీ తదితరులున్నారు.

బీజేపీలో చేరికలు

తల్లాడ: తల్లాడకు చెందిన వైరా మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, బీఆర్‌ఎస్ మండల నాయకులు దూపాటి భద్రరాజు ఆదివారం బీజేపీలో చేరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ సమక్షంలో ఖమ్మం పార్లమెంట్ క్యాంప్ కార్యాలయంలో సత్యనారాయణ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. మూడు ధపాలుగా వైరా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా తల్లాడ గ్రామ పంచాయతీగా ఉప సర్పంచ్‌గా, సండ్ర వెంకటవీరయ్య అనుచరుడిగా పని చేశారు. ఆయనతో పాటు తల్లాడ బీఆర్‌ఎస్ యువ నాయకులు నరేష్‌రాజు, ఎమ్మార్పీఎస్ నాయకుడు కాంపల్లి వీరయ్య బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కిరణ్, బీజేపీ మహిళా మోర్చా నాయకురాలు విజయరెడ్డి, కృష్ణారావు పాల్గొన్నారు.

ఘనంగా నర్సుల దినోత్సవం

మధిర: మధిర స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు జంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. రోగులే దైవంగా సేవలందిస్తున్న నర్సులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్విమ్మర్స్ అసోసియేషన్ సభ్యుడు పల్లపోతుల ప్రసాదరావు, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, అబ్రహం, భాస్కర్‌రావు, పూర్ణచందర్‌రావు, రాంబాబు, హనుమ, రాము, సాంబిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, సుకూర్, ఉపేంద్ర, సత్యనారాయణ, అబ్దుల్ హనీఫ్, రెహమాన్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ వితరణ

వైరా: లయన్స్‌క్లబ్ మీల్స్ ఆన్ వీల్స్ కోఆర్డినేటర్ చింతోజు నాగేశ్వరరావు, సీత దంపతులు, క్లబ్ సహాయ కార్యదర్శి కొల్లా రాంబాబు, నాగమణిల వివాహ వార్షికోత్సావాలను పురస్కరించుకుని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నర్సింగ్ కోర్సు చేస్తున్న ఖమ్మంకు చెందిన కావ్యకు రూ.10 వేలు నగదు, పెనుబల్లి మండలం తాళ్లపెంట గ్రామానికి చెందిన నడిపల్లి శ్రీదేవికి రూ.7 వేలు విలువ చేసే కుట్టుమిషన్ వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో వైరా క్లబ్ అధ్యక్షుడు పెనగొండ ఉపేందర్‌రావు, రీజనల్ చైర్మన్ ప్రభాకర్‌రావు, రమేష్, వెంకటేశ్వరరావు, కృష్ణమూర్తి, వెంకటేష్, శ్రీధర్, శ్రీనివాసరావు, సరిత, హనుమాయమ్మ, నాగేశ్వరరావు, బుచ్చిరామారావు, కావ్యాచారి, వాసవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శంకర్ జయంతి

మధిర: మధిర బ్రాహ్మణ బాజారులోని శ్రీ మాతా ధర్మరక్షణ శ్రీ పీఠంలో వేదమూర్తులు బ్రహ్మశ్రీ ఇంగువ భవాని శంకర్ శర్మ ఆదివారం శంకర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సనాతన ధర్మం అంతరిస్తున్న తరుణంలో స్వయంగా భగవంతుడే శంకరాచార్య రూపంలో కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు దేశవ్యాప్తంగా నాలుగుసార్లు నడయాడి ధర్మాన్ని పునఃప్రతిష్టించి నలుదిశలా పీఠాలను స్థాపించిన అపర శంకరులే శంకరాచార్యులని తెలిపారు. అందుకే వీరిని జగద్గురు ఆది శంకరాచార్య అని పిలుస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీపీఠ వ్యవస్థాపకులు భట్లపెనుమర్తి రాజేశ్వర శర్మ, లక్ష్మీతులసి, సత్య జగన్నాథ్, పవన్ శర్మ, గోపాలకృష్ణ, హనుమత్ శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.



సత్తుపల్లి రిసెప్షన్ కేంద్రంలో పోలింగ్ సామగ్రిని సరిచూసుకుంటున్న అధికారులు



పోలీస్ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఏసీపీ రఘు



సత్తుపల్లిలో పోలింగ్ మెటీరియల్‌ను పరిశీలిస్తున్న కేంద్ర పరిశీలకుడు సంజయ్ జి కోల్టే

నేడే పోలింగ్..

- ఎన్నికలు సజావుగా నిర్వహించండి
- పోలింగ్ కేంద్రాలకు తరలిన ఎన్నికల సామగ్రి

సత్తుపల్లిటౌన్: పార్లమెంట్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు జరిగే పోలింగ్‌కు ఎన్నికల యంత్రాంగం సర్వం సిద్ధంచేసింది. సత్తుపల్లి నియోజకవర్గంలోని 294పోలింగ్ కేంద్రాలకు 520మంది పోలిస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నారు. పోలింగ్ మెటీరియల్‌తో పాటు ఈ ఎన్నికలకు వెల్ఫేర్‌కిట్, మెడికల్ కిట్, స్టేషనరీ మెటీరియల్, టీషర్టులు, క్యాప్‌లను అదనంగా అందించారు. పీఓ, ఏపీఓలు, ఓపీఓలతో కలిపి 1,441మంది పోలింగ్ విధులను నిర్వహించనున్నారు.

పోలీస్ బందోబస్తుతో..

స్థానిక జ్యోతినిలయం కేంద్రంలో ఎన్నికల సామగ్రిని ఆదివారం పోలింగ్ అధికారులు పోలీసు బందోబస్తు మధ్య పోలింగ్ కేంద్రాలకు తరలించారు. నియోజకవర్గాన్ని 28సెక్టార్లుగా చేయగా మైక్రో అబ్జర్వర్లు, వెబ్ కాస్టింగ్ సిబ్బందిని పోలింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించనున్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి సీహెచ్ రాజేంద్రగౌడ్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల ఏర్పాట్లను కేంద్ర ఎన్నికల పరిశీలకులు సంజయ్ జి కోల్టే పర్యవేక్షించారు. ఏసీపీ ఎ.రఘు, ఏఆర్ ఏసీపీ నర్సయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏడు పార్లమెంట్ ఎన్నికల్లో..



నేను 1996 నుంచి ఎన్నికల విధులను నిర్వహిస్తున్నా.. ఇప్పటి వరకు ఏడు పార్లమెంట్ ఎన్నికలకు ప్రిసైడింగ్ అధికారిగా పని చేశాను. ఈ ఎన్నికలతో పాటు అసెంబ్లీ, పంచాయతీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల విధులు కూడా నిర్వహించా. పోలింగ్ ఏజెంట్ల సమన్వయంతో ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించా.

– బండి నాగేశ్వరరావు, పీఓ, ఖమ్మం

పదిసార్లు ఎన్నికల విధుల్లో..



ఇప్పటి వరకు పదిసార్లు ఎన్నికల విధులు నిర్వహించా. ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు ఇచ్చిన శిక్షణా కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఇక్కడ డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఏర్పాటు చేసిన కౌంటర్లు, టేబుల్స్ విభాగాల ఏర్పాట్లు చాలా చక్కగా ఏర్పాటు చేశారు.

– బి.కృష్ణయ్య, ఓపీఓ, ఖమ్మం

నిబంధనల ప్రకారం..



ఎన్నికల నిబంధనల ప్రకారం పోలింగ్ సమర్థవంతంగా నిర్వహిస్తాం. 2014 నుంచి ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నా. ఇప్పటి వరకు చేసిన అన్ని ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. శిక్షణలో ఇచ్చిన అంశాలను అనుసరించి పోలింగ్ ప్రక్రియ నిర్వహిస్తా.

– ఎస్‌కే షకీలాబేగం, ఓపీఓ, కల్లూరు

సర్వం సిద్ధం

పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఎన్నికల సిబ్బంది

మధిర: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులు, సిబ్బంది ఆదివారం పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మధిర నియోజకవర్గంలో మొత్తం 268 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. 25 రూట్లుగా విభజించారు. అన్ని పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు, వీవీ ప్యాట్లు తదితర మెటీరియల్‌ను తరలించారు. ఖాజీపురం సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మెటీరియల్ పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఆర్డీఓ గణేష్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట పోలీస్ బందోబస్త్ నిర్వహించారు.

కల్లూరు మండలంలో..



పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఎన్నికల సిబ్బంది

కల్లూరురూరల్: మండలంలోని వివిధ పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది ఆదివారం మధ్యాహ్నం నుంచి చేరుకున్నారు. మండలంలో మొత్తం 63 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. పోలీస్ సిబ్బందితో పాటు భద్రతా సిబ్బంది కూడా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు.

ముదిగొండలో..



ఎస్ఐ నరేష్

ముదిగొండ: మండలంలోని పంచాయతీల్లో మొత్తం 48,212మంది ఓటర్లు ఉండగా.. అందులో పురుషురు 23,139మంది, మహిళా ఓటర్లు 25,071మంది ఉన్నారు. ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు 55 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 210 మంది పోలీస్ బలగాలు విధులకు హాజరు కానున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. మండలాన్ని 5రూట్లుగా విభజించారు. ప్రజలందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ రామారావు కోరారు.

తల్లాడ మండలంలో..



అన్నారుగూడెం పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది

తల్లాడ: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సర్వసిద్ధమైంది. మండలంలోని 57 పోలింగ్ భూత్‌లలో అని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆదివారం పోలింగ్ సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. తల్లాడ మహిళా పోలింగ్ భూత్‌ను మోడల్‌గా తీర్చి దిద్దారు. పోలింగ్ భూత్‌లను తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ చంద్రమౌళి, సెక్టార్ అధికారులు కె.శ్రీదేవి, అశోక్ పర్యవేక్షించారు.

ఎర్రుపాలెంలో..



పోలింగ్ కేంద్రంలో సిబ్బందికి సూచనలిస్తున్న తహసీల్దార్ ఉషాశారద

ఎర్రుపాలెం: మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో మొత్తం 39,978 మంది ఓటర్లున్నారు. వీరు ఓట్లు వేసేందుకు గానూ మండలంలో మొత్తం 54 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఐదు సెక్టార్ల పరిధిలో 216 మంది పోలింగ్ సిబ్బంది విధుల్లో పాల్గొననున్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రానికి ఒక పోలీస్‌ను నియామకం చేశారు. పోలింగ్ ఏర్పాట్లను తహసీల్దార్ ఉషాశారద పర్యవేక్షిస్తున్నారు. శాంతిభద్రతలను ఎస్ఐ సురేష్ పర్యవేక్షిస్తున్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

చింతకాని: లోక్‌సభ ఎన్నికలో ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎంపీడీఓ రామయ్య, ఎస్సై షేక్ నాగుల్‌మీరా తెలిపారు. మండలంలో ఉన్నటువంటి 49 పోలింగ్ కేంద్రాల్లో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులతో పాటు పోలింగ్ సిబ్బంది మొత్తం 221 మంది పోలింగ్ అధికారులు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. అలాగే ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు వైరా ఏసీపీ రెహమాన్ పర్యవేక్షణలో సుమారు 100 మంది పోలీసులను బందోబస్తుగా ఏర్పాటు చేసినట్లు ఎస్సై తెలిపారు.

స్థానిక పోలీసులతో పాటు సమస్యాత్మక గ్రామాల్లో 30 మంది సీఆర్‌పీఎఫ్ బలగాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే 5 రూట్లకు 5 మొబైల్ టీంలు, రెండు స్ట్రైకింగ్ ఫోర్స్, ఒక స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా మదర్స్ డే వేడుకలు



ఎర్రుపాలెం: తల్లులకు పాదపూజ చేస్తున్న చిన్నారులు

మధిర/ఎర్రుపాలెం: మధిరలో కలయిక వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో, ఎర్రుపాలెం మండలకేంద్రంలోని శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత శ్రీచంద్రమౌళేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో.. ఆర్యవైశ్య–వాసవీక్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో మదర్స్ డే వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పలువురు చిన్నారులు తమ తమ తల్లుల పాదాలకు పాదపూజ చేసి.. మాతృ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కలయిక వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఇరుకుల బాల కోటేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు వేమూరి సునీల్ కుమార్, ప్రధాన కార్యదర్శి పరంకుశం శ్రీనివాసరావు, కోశాధికారి కాజా శ్రీనివాసరావు, సభ్యులు, వాసవీ క్లబ్ మండల కమిటీ అధ్యక్షుడు వెంకటఅప్పారావు, పరమేశ్వరరావు, నర్సింహారావు తదితరులు ఉన్నారు.

నారాయణపురంలో ఓటు వేయనున్న పొంగులేటి



నారాయణపురంలో ఏర్పాటు చేసిన ఆదర్శ పోలింగ్ కేంద్రం

కల్లూరురూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో తన స్వగ్రామం కల్లూరు మండలంలోని నారాయణపురం గ్రామంలోని 94వ పోలింగ్ బూత్‌లో రాష్ట్ర రెవెన్యూశాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అదే విధంగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి, బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డిలు సోమవారం ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

జానకీపురంలో మోడల్ పోలింగ్ కేంద్రం



బోనకల్: మండలంలోని జానకీపురం గ్రామంలో మోడల్ పోలింగ్ కేంద్రాన్ని(దివ్యాంగుల ఆదర్శ పోలింగ్ కేంద్రం) అధికారులు ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. దివ్యాంగులకు వసతుల కల్పన చేశారు. ఓటర్లను ఆకర్షించే రీతిలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రంలో పూర్తిస్థాయి వసతుల కల్పన చేశారు.

ఎలక్ట్రానిక్ మీడియా కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

వైరా: వైరా రిజర్వాయర్ వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వైరా నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా చింతల వసంతరావు, ఉపాధ్యక్షుడిగా ఎస్‌కే రఫీ, ప్రధాన కార్యదర్శిగా సత్తెనపల్లి లక్ష్మణాచారి, గౌరవ అధ్యక్షుడిగా మామిళ్లపల్లి విజయ్, సహ ఉపాధ్యక్షులుగా మఠం దినేష్‌కుమార్, జి.ప్రశాంత్, కోశాధికారిగా రేచర్ల నాగరాజు తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు వసంతరావు మాట్లాడుతూ.. వైరా నియోజకవర్గంలోని జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో భూక్యా శ్రీనివాసరావు, నెమలికొండ గోవిందాచారి, ధర్మపురి రవితేజ, మాచర్ల యోగానంద్, సత్తెనపల్లి నరసింహారావు, తిరమలరావు, శేషగిరిరావు, రాజు, బాబు, సురేష్, సాయి లిఖిత్ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత కంఠస్థ పోటీల్లో ప్రతిభ



గుంటుపల్లి పద్మ

తల్లాడ: తల్లాడకు చెందిన గుంటుపల్లి పద్మ భగవద్గీత కంఠస్థ పోటీల్లో తన ప్రతిభను చాటుకొని గోల్డ్ మెడల్ సాధించింది. కర్నాటక రాష్టం మైసూర్‌లోని గణపతి సచ్చిదానంద దత్తపీఠం ఆశ్రమంవారు ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించిన భగవద్గీత కంఠస్థ ఆన్‌లైన్ టెలిగ్రామ్ పోటీల నిర్వహణలో 18 అధ్యాయాలనుండి 25 నిముషాలలో వారు అడిగిన 150 శ్లోకాలు, ఉచ్చారణ దోషాలు లేకుండా కళ్లుమూసుకొని, ఏ అధ్యయనం అడిగినా.. తడబడకుండా చెప్పడంతో పద్మను గోల్డ్ మెడల్ వరించింది. ఈ పోటీల్లో 810 మంది వివిధ దేశాల నుంచి పాల్గొనగా.. తెలంగాణా నుంచి పద్మ తన ప్రతిభను చాటుకుంది. ఈ నెల 17,18,19 తేదీల్లో కర్నాటకలోని మైసూర్‌లో గోల్డ్‌మెడల్ అందుకోనున్నారు. ఈ సందర్భంగా గుంటుపల్లి పద్మను పలువురు అభినందించారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవం



సాయిబాబా మందిరంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

కారేపల్లి: కారేపల్లిలోని శ్రీషిరిడీ సాయిబాబా మందిరం 25వ వార్షికోత్సవ ముగింపు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు నాగసాయిశర్మ ఆధ్వర్యంలో మూలమంత్ర హోమాలు, పూర్ణాహుతి, ఆలయ శిఖరాభిషేకంతో పాటు, సాయిబాబాకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సూర్యనారాయణ, నరేష్, విఠల్, హనుమంతరావు, బుచ్చిబాబు, సురేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సురేందర్ మనియార్, రాము ధరక్, రమేష్, శ్రీనివాసరావు, సనత్‌కుమార్, శ్రీను, ప్రసాద్, నరసింహారావు, సాలయ్య, మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కోటమైసమ్మతల్లి ఆలయానికి ఏసీ వితరణ



ఏసీని అందజేస్తున్న దాతలు

కారేపల్లి: కొలిచిన వారికి కొంగుబంగారమై భక్తుల కోర్కెలు తీర్చే శ్రీకోటమైసమ్మతల్లికి ఓ భక్తుడు ఎయిర్ కండిషనర్‌ను వితరణగా అందజేసి తన భక్తిపారవశ్యాన్ని చాటుకున్నాడు. మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామంలో కొలువుతీరిన శ్రీకోటమైసమ్మతల్లి దేవాలయంకు, ఖమ్మం నగరానికి చెందిన సామినేని గంగాధర్, కృష్ణవేణి దంపతులు ఏసీని ఆదివారం వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పర్సాట్రస్టు చైర్మన్ పర్సా పట్టాభిరామారావు, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈఓ వేణుగోపాలాచార్యులు మాట్లాడుతూ.. శ్రీకోటమైసమ్మతల్లి ఆలయ అభివృద్ధికి భక్తులు ముందుకు వచ్చి సహకారాలు అందించటం అభినందనీయమన్నారు. అనంతర ఆలయ ప్రధానార్చకులు కొత్తలంక కైలాసశర్మ ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ సిబ్బంది భీమవరపు సూర్యప్రకాశ్, మూడ్ మోహన్ చౌహాన్, దాతల కుటుంబ సభ్యులు వెంకటేశ్వర్లు, వాణిశ్రీ , శ్రీనివాసరావు, రంగారావు, రమాదేవి, వసంతకుమారి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

14న బొగ్గు రవాణాను అడ్డుకుంటాం



ఆందోళన చేస్తున్న లారీ యజమానులు

సత్తుపల్లి: రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్(ఆర్‌సీహెచ్‌పీ)కు తరలిస్తున్న బొగ్గు రవాణాను అడ్డుకుంటామని లారీ యజమానుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కొండపల్లి రమేష్‌రెడ్డి, ఎస్‌కె కీజర్ తెలిపారు. స్థానిక లారీ యూనియన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సత్తుపల్లిలో 750 లారీలు బొగ్గు రవాణాపై ఆధారపడి జీవిస్తున్నారని, ఉత్పత్తిలో 40శాతం రవాణాకు ఇవ్వాల్సి ఉండగా కేవలం 2వేల టన్నులు ఇచ్చి లారీ యజమానులను నష్టపోయేలా సింగరేణి సంస్థ వ్యవహరిస్తుందన్నారు. గతేడాది వరకు రోజుకు 150 నుంచి 200 లారీలకు లోడింగ్ ఇచ్చే సింగరేణి యాజమాన్యం నాలుగు నెలల నుంచి ఇబ్బందులు పెడుతుందన్నారు. లోడింగ్‌కు నాణ్యమైన బొగ్గు ఇవ్వకపోవడంతోనే బయట ఫ్యాక్టరీలు ముందుకు రాకపోవడంతోనే లోడింగ్ సమస్య తలెత్తిందన్నారు. దీనికి తోడు నాణ్యమైన బొగ్గును ఆర్‌సీహెచ్‌పీకి టిప్పర్ల ద్వారా రవాణా చేసేందుకు అనుమతి ఇచ్చిందని, దీనిని ఎట్టి పరిస్థితుల్లో వ్యతిరేకించి తీరుతామన్నారు. ఇకనైనా సింగరేణి యాజమాన్యం తీరుమార్చుకొని నాణ్యమైన బొగ్గును లోడింగ్‌కు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్‌కె మౌలాలీ, పీఎల్ ప్రసాద్, అబ్దుల్ రెహమాన్, వేముల విశ్వనాథం, ఎస్‌కె మోసిన్, ఎస్‌కె గౌస్, వెలిశాల చెన్నాచారి, లియాకత్‌అలి, ఎస్‌కె రహీం పాల్గొన్నారు.

మండలంలో భారీ వర్షం

- గాలి దుమారానికి కూలిన టెంట్లు
- నిలిచిన విద్యుత్ సరఫరా
- ఇబ్బంది పడ్డ పోలింగ్ సిబ్బంది



వైరారూరల్: రెబ్బవరం జెడ్పీహెచ్‌ఎస్‌లోని పోలింగ్ కేంద్రం వద్ద గాలి దుమారానికి కూలిన టెంట్లు



వైరా: సెల్‌ఫోన్ లైట్ల వెలుతురులో విధులు నిర్వహిస్తున్న ఎన్నికల సిబ్బంది

వైరా/వైరారూరల్/కొణిజర్ల: మండలంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. వర్షంతో పాటు ఈదురు గాలులు కూడా రావడంతో పలు పోలింగ్ స్టేషన్లలో ఓటర్ల కోసం ఏర్పాటు చేసిన టెంట్లు నేల కూలాయి. ఈ మేరకు వైరాలోని ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మహిళ మోడలింగ్ పోలింగ్ కేంద్రం, ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని దివ్యాంగుల మోడల్ కేంద్రంలో అధికారులు ఏర్పాటు చేసిన టెంట్లు కూలిపోయాయి. అదే విధంగా వైరా మండలంలోని రెబ్బవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటుగా కొణిజర్లలోని పలు గ్రామాల్లో ఏర్పాట్లు టెంట్లు కూలిపోయాయి. దీంతో అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. మరో వైపు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించేందుకు వచ్చిన పోలింగ్ సెల్ ఫోన్ లైట్లతో విధులు నిర్వహించారు.

చింతకాని/తల్లాడ: చింతకాని, తల్లాడ మండలాల్లో ఆదివారం రాత్రి ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. కల్లాల్లో ఆరబెట్టిన మొక్కజొన్న పంట వర్షానికి తడవకుండా కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడ్డారు. అలాగే ఈదురుగాలులకు మామిడి పంట నేలరాలటంతో మామిడి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వర్షం రాకతో రోడ్ల వెంట వరదనీరు పారింది. ఎండల తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు వర్షానికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతో ఉపశమనం పొందారు.



వైరాలోని మోడల్ పోలింగ్ కేంద్రంలో కూలిన టెంట్



కొణిజర్ల హైస్కూల్‌లో కింద పడ్డ టెంట్



తల్లాడలో రోడ్ల వెంట ప్రవహిస్తున్న వరదనీరు